క్లుప్తంగా

అన్నసమారాధన

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి శ్రీనివాసనగరంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాకపోకలకు ఇక్కట్లు



రహదారిపై అడ్డంగా ఉన్న చెట్టు

ఏలేశ్వరం: నిత్యం జనసంచారం ఉండే రహదారిని ఆనుకుని చెట్టు పెరిగిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పైడిమల్లమ్మ గుడి సమీపంలో రహదారి ఆనుకుని చెట్టు పెరిగింది. ఇది భారీ వృక్షంగా మారడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు చెట్టును ఆనుకుని తుప్పలు పెరిగిపోయాయి. అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



ప్రత్తిపాడులో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

ప్రత్తిపాడు: పేదలకు సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీషిర్డీసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి కోరారు. ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం వద్ద శనివారం ఎస్ఎంఎస్ సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. గ్రామంలోని పేద విద్యార్థులకు శ్రీనివాసరెడ్డి కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ ఛాయాచిత్ర అవార్డు గ్రహీత సలాది కృష్ణ, ఎస్ఎంఎస్ ప్రతినిధులు గొందేసి సత్యానందం, భేరి రాంబాబు, కె.జగదీశ్వరి, శిరసాల మణికంట జ్యోతి, ఎస్.కుమారి, లక్ష్మి తదితులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాలకు పోటెత్తిన భక్తులు



గుమ్మళ్లదొడ్డిలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

గోకవరం: మండలంలోని తంటికొండ, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. తంటికొండలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఉదయం నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అలాగే గుమ్మళ్లదొడ్డిలో పుట్టలో వేంచేసిన వల్మీక వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహించగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

కుష్ఠు నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

పెద్దాపురం: కుష్ఠు వ్యాధి నివారణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 18న జాతీయ కుష్ఠు నివారణ దినోత్సవ వాల్‌పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యుల సూచనల మేరకు కుష్ఠు వ్యాధిని గుర్తించే ప్రక్రియకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, ఎంపీడీఓ ఉషారాణి, కాండ్రకోట, పులిమేరు పీహెచ్‌సీల వైద్యులు ప్రియదర్శిని, శ్రావణిలతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెరకు సాగు .. కనుమరుగు

- మెట్టలో కనిపించని చెరకు పంట
- సాగుపై చేతులెత్తేసిన రైతులు
- మూతపడిన తాండవ సుగర్ ఫ్యాక్టరీ



కోటనందూరులో సాగు చేసిన చెరకు (ఫైల్)

కోటనందూరు: తాండవ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో ఒకప్పుడు ఎక్కడ చూసినా చెరకు పంటే దర్శనమిచ్చేది. సీజన్ వచ్చిందంటే చాలు చెరకు తరలించే లారీలు, బండ్లతో మెట్ట ప్రాంతమంతా కళకళలాడేది. అలాంటి చెరకు సాగు ప్రస్తుతం కనుమరుగైంది. కనీసం దేవుడికి చెరకుముక్క పెట్టాలన్నా దొరికే పరిస్థితి లేదు. ఈ దుస్థితికి పాలకుల స్వార్థపూరిత విధానాలే కారణం. రెండు దశాబ్దాలుగా రైతుల ప్రయోజనాలను పూర్తిగా మరిచిపోయి ఫ్యాక్టరీని నిర్వహణను ఇష్టారాజ్యంగా మర్చేశారు. ఫలితంగా ఫ్యాక్టరీ క్రమంగా దిగజారుతూ వచ్చి చివరకు మూతపడింది. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులతో ఇబ్బంది పడే రైతన్నలకు వరి కన్నా చెరకు పంటే ఎక్కువ మేలు చేసేది. తాండవ సుగర్ ఫ్యాక్టరీని తెరచి లాభదాయకంగా ఉండే చెరకు సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించాలని మెట్ట ప్రాంత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐదు దశాబ్దాల క్రితం..

తుని, పాయకరావుపేట సరిహద్దు ప్రాంతంలో ఐదు దశాబ్దాల క్రితం తాండవ సుగర్ ఫ్యాక్టరీని నిర్మించారు. ఈ ఫ్యాక్టరీ తుని, ప్రత్తిపాడు, అనకాపల్లి జిల్లా పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. ఈ కర్మాగారంలో 13 వేల మంది షేర్ హోల్డర్లు ఉండగా 650 మంది కార్మికులు పని చేసేవారు. ఫ్యాక్టరీ నెలకొల్పిన తొలినాళ్లలో నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల వరకూ క్రషింగ్ జరిగేది. రైతులకు ఎరువులు, పురుగు మందులు వంటి ప్రోత్సాహకాలు ఇచ్చి ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహించేది. కాలక్రమంలో ప్రభుత్వ ప్రోత్సాహం కరువవ్వడం, ఫ్యాక్టరీ నిర్వహణ దిగజారడంతో క్రషింగ్ సామర్థ్యం వేల టన్నులకు దిగజారింది. ఆ తరువాత పరిస్థితి మరింత క్షీణిస్తూ చివరకు క్రషింగ్ చేయలేని దయనీయ పరిస్థితికి చేరింది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా చెరకు కాటాలు

తాండవ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో 12 చెరకు సేకరణ కేంద్రాలు (చెరకు కాటాలు) ఉండగా ఒక్క కోటనందూరు మండలంలోనే 6 కాటాలు ఉన్నాయి. ఈ కాటాలన్నీ ఎకరం నుంచి ఐదెకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. ఈ కాటాల్లో రైతులకు, ఎడ్లకు అవసరమైన అన్ని వసతులు ఉన్నాయి. ఫ్యాక్టరీ మూతపడడంతో కాటాలన్నీ నిరుపయోగంగా మారాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. సాయంత్రం వేళల్లో ఈ కాటాల వద్ద మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. మరోపక్క కాటాలు ఆక్రమణకు గురవుతున్నాయి. వీటిని పరిరక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే పరిస్థితి మరికొద్ది రోజులు కొనసాగితే కాటాలు పూర్తిగా ఆక్రమణల చెరలోకి వెళ్లే ప్రమాదముంది.

రూ.50 కోట్లు పెడితే పూర్వ వైభవం

మూతపడిన తాండవ సుగర్ ఫ్యాక్టరీని తిరిగి అందుబాటులోకి తీసుకురావాలంటే రూ.50 కోట్లు వరకూ ఖర్చు చేయాల్సిన అవసరం ఉందని రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వం రైతుల బకాయిలు పూర్తిస్థాయిలో, కార్మికుల బకాయిలు కొంతమేర చెల్లించేసింది. నూతన ప్రభుత్వం ఫ్యాక్టరీకి పూర్తి స్థాయిలో మరమ్మత్తులు చేయిస్తే ఫ్యాక్టరీ పూర్వ వైభవం సంతరించుకుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు గతంలో మాదిరిగానే ప్రోత్సాహకాలు అందిస్తూ చెరకు సాగును ప్రోత్సహిస్తే అన్నదాతలకు మేలు జరిగే అవకాశం ఉంది.

ఫ్యాక్టరీని తెరవాలి



గతంలో ఫ్యాక్టరీ ఒక పద్ధతి ప్రకారం నడవకపోవడంతో మూతపడింది. వరిసాగుతో రైతుకు పెద్దగా ప్రయోజనం ఉండదు. ఈ తరుణంలో అన్నివిధాలా లాభదాయకంగా ఉండే చెరకు సాగును ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఫ్యాక్టరీని తిరిగి తెరిపించేందుకు పాలకులు, సంబంధిత అధికారులు కృషి చేయాలి.

– రామసూర్యసత్యనారాయణ, చెరకు రైతు, బొద్దవరం

చెరకు రైతులను ఆదుకోవాలి



నిస్సహాయ స్థితిలో ఉన్న చెరకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రోత్సాహకాలు ఇచ్చి చెరకు సాగును ప్రోత్సహించాలి. ఫ్యాక్టరీ మూతడడంతో ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు కాటాలన్నీ అలంకారప్రాయంగా మారాయి. ప్రస్తుతం కాటాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. సాయంత్రం వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. అధికారులు కాటాలను పరిరక్షించాలి.

– కరక అప్పలనాయుడు, చెరకు రైతు, కేఈ చిన్నయ్యపాలెం

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



జి.కొత్తపల్లిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శనివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

19న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

తుని: అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ఈ నెల 19న తుని ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు నడుతున్నట్టు డిపో మేనేజరు ఎన్.కిరణ్‌కుమార్ శనివారం తెలిపారు. విజయవాడ, శ్రీకాళహిస్తి, శ్రీపురం, పౌర్ణమి రోజున అరుణాచలం గిరిప్రదక్షిణ అనంతరం కంచి దర్శనం ఉంటుందన్నారు. పెద్దలకు టికెట్టు రూ.3500, పిల్లలు రూ.2625గా నిర్ణయించామన్నారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జోరు వాన

ఏలేశ్వరం: అల్పపీడనం, ఉపరితల ద్రోణి ప్రభావంతో నియోజకవర్గవ్యాప్తంగా శనివారం భారీ వర్షం కురిసింది. తెలవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై వర్షం నిల్వ ఉండిపోయింది. స్థానిక లింగవరం కాలనీ, చైతన్యనగర్ కాలనీ తదితర కాలనీల్లోని రహదారులపై రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాలు బురదమయంగా మారాయి. ఈ వర్షాలు ఖరీఫ్ సాగుకు మేలు చేస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు అంటురోగాలు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దానవాయిపేట సముద్రతీరంలో నిలిపిన బోట్లు



ఏలేశ్వరంలో కురుస్తున్న వర్షం, రహదారిపై నిలిచిన నీరు



ప్రత్తిపాడు అల్లూరి జంక్షన్‌లో రహదారి ఛిద్రమై గోతుల్లో చేరిన నీరు

ఎడతెరిపి లేకుండా వర్షం

ప్రత్తిపాడు: మండల వ్యాప్తంగా శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వర్షం కురుస్తూనే ఉంది. వానకు స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, అంబేడ్కర్ కళామందిర్, అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద రహదారులపై వర్షం నీరు తిష్ట వేసింది. నిత్యం రద్దీగా ఉండే స్థానిక అల్లూరి జంక్షన్‌లో చినుకుపడిన ప్రతిసారి వర్షం నీరు నిల్వ ఉండిపోతోంది. ఈ మడుగు మీదుగా ద్విచక్రవాహనాలు, భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డు శిథిలమైంది. రహదారిపై గోతులు పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పలువురు వాహనదారులు గోతులను గమనించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు కూడా గోతుల్లో పడి మొరాయిస్తున్నాయని వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే అల్లూరి జంక్షన్‌లో రహదారి మరమ్మత్తులు చేపట్టాలని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, వాహన చోదకులు కోరుతున్నారు.

మెట్టలో వర్షం

తొండంగి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కొద్ది రోజులుగా మండలంలోని మెట్ట, పల్లపు ప్రాంతాల్లో ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలయమయమయ్యాయి. శనివారం ఉదయం దాదాపు గంటన్నరకు పైగా వర్షం కురిసింది. రహదారులపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పలుచోట్ల ఇటుకల బట్టీలు మూతపడ్డాయి.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

సముద్రంలో చేపల వేటకు ప్రతికూల వాతావరణం నేపథ్యంలో తీర గ్రామాల మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తుని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ ఉమామహేశ్వరరావు సూచించారు. సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు. దీంతో తీరంలో మత్స్యకారులు తమ బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



మార్కెట్‌లో దగ్గరుండి వ్యర్థాలు తొలగిస్తున్న అధికారులు



కప్పలచెరువు వద్ద జేసీబీతో వ్యర్థాల తొలగింపు

సాక్షి ఇంపాక్ట్

ఏలేశ్వరం: పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలో ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోవడంతో ఈ నెల 12న 'పడకేసిన పారిశుధ్యం' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు శనివారం మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించారు. అలాగే కప్పలచెరువు సమీపంలోని రహదారిని ఆనుకుని ఉన్న చెత్తగుట్టలను తొలగించారు. సమస్య పరిష్కారం కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సూర్యారావు కుటుంబానికి వంగా గీత పరామర్శ



దానవాయిపేటలో సూర్యారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ వంగా గీత

తొండంగి: మండలంలోని దానవాయిపేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బెనుగు సూర్యారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను కాకినాడ మాజీ ఎంపీ వంగా గీత శనివారం పరామర్శించారు. దానవాయిపేటలో సూర్యారావు ఇంటికి వెళ్లి ఆయన కుమారుడు నాగేశ్వరరావు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమె వెంట జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, సర్పంచ్ మడదా తిరుమల కుమారి, మడదా హేమంత్ ఉన్నారు.

ఎ.కొత్తపల్లిలో..

మండలంలోని ఎ.కొత్తపల్లి మాజీ సర్పంచ్ అచ్చా అప్పారావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు శనివారం పరామర్శించారు. ఎ.కొత్తపల్లిలో అప్పారావు కుటుంబ సభ్యులను పార్టీ నాయకులతో కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తాండవ జలాలు కలుషితం



తాండవ నదిలో వేసిన వ్యర్థాలు

తుని రూరల్: తాండవ నదీ జలాలు వ్యర్థాలతో కలుషితమవుతున్నాయి. తుని పట్టణ శివారు కత్రాళ్లకొండ ఎగువన కుమ్మరిలోవ నుంచి తుని వచ్చే రహదారిని ఆనుకుని ఉన్న తాండవ నదిలో అధికార సిబ్బంది వ్యర్థాలను గుట్టుచప్పుడు కాకుండా డంపింగ్ చేస్తున్నారు. నదీ జలాలు కలుషితమవ్వడంతో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిగువన తాండవ నదిపై నిర్మించిన ముఠా ఛానల్, గ్రోయిన్ల ద్వారా కలుషిత జలాలు పంట పొలాలకు చేరుతున్నాయి. ఈ రెండు మినీ రిజర్వాయర్ల ద్వారా 10 వేల ఎకరాలకు సాగునీరు చేరుతుండగా కలుషిత జలాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. వ్యర్థాల కారణంగా దుర్వాసన వస్తోందని కుమ్మరిలోవ, కొలిమేరు, ఎస్.సూరవరం, సుభద్రయ్యమ్మపేట, ఎస్ఎస్వీ నగరం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్తికమాసం, ఇతర పర్వదినాల్లో సమీపంలోనే వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి శివాలయం, అయ్యప్పస్వామి, కనకదుర్గమ్మ ఆలయాలకు, రాజరాజేశ్వరి అమ్మవారిని, సచ్చిదానంద సరస్వతీ మహాస్వామిని దర్శించేందుకు కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమానికి వెళతారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నదీ జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సత్యదేవునికి సంగీత వాయిద్యాల సమర్పణ



సంగీత పరికరాలను దేవస్థానం వాయిద్య బృందానికి అందజేస్తున్న దాత జగదీష్

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని పూజా కార్యక్రమాల్లో ఉపయోగించే సంగీత వాయిద్యాలను విజయవాడకు చెందిన దాత శనగశెట్టి జగదీష్ అన్నవరం దేవస్థానానికి శనివారం సమర్పించారు. రెండు సన్నాయిలు, రెండు డోల్లును ఆలయ ఏఈఓ కృష్ణారావు సమక్షంలో దేవస్థానం వాయిద్య బృందానికి అందజేశారు. వీటి విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని తెలిపారు. అనంతరం స్వామివారి సన్నిధిలో భక్తి గీతాలు ఆలపిస్తూ ఆ సంగీత వాయిద్యాలను వాయించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గణపతి పాల్గొన్నారు.

కళాకారుడు నూకరాజుకు రాష్ట్ర స్థాయి పురస్కారం



ఉమ్మడి రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకుంటున్న కళాకారుడు సానా నూకరాజు



ఏకపాత్రాభినయం చేస్తున్న నూకరాజు నాయుడు (ఫైల్)

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన రంగస్థల కళాకారుడు సానా నూకరాజు నాయుడికి రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. కాకినాడ సూర్య కళామందిర్‌లో అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఇటీవల మూడు రోజుల పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక ఏకపాత్ర అభినయపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నూకరాజు నాయుడు ప్రదర్శించిన బ్రహ్మర్షి విశ్వామిత్ర ఏక పాత్రాభినయానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల స్థాయిలో తృతీయ బహుమతి లభించింది. కాగా శనివారం కాకినాడ సూర్యకళామందిర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకులు, కళాపరిషత్ అధ్యక్షుడు కర్రి అచ్యుతరామరెడ్డి, గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానంద బాబు, అల్లూరి గ్రంథ రచయిత పడాల సత్యనారాయణ తదితరులు నూకరాజునాయుడికి మెమెంటో, నగదు పురస్కారం అందజేశారు. రాష్ట్ర స్థాయి పురస్కారం పొందిన నూకరాజును సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, గ్రామ పెద్దలు సిద్ధా పెద్దకాపు, అద్దేపల్లి రాజా, అద్దేపల్లి రత్నకుమారి, సీనియర్ కళాకారులు గళ్లా పద్మారావు, బైరా రాజు, జ్యోతుల అప్పారావు, సానా సూరిబాబు, చెన్నాడా రాము, జువ్వల గోపాలస్వామి తదితరులు అభినందించారు.

అతిసారంపై ఆరా

- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులకు పరామర్శ
- బాధితుల నివాస ప్రాంతాల్లో పారిశుధ్య పరిశీలన

కాకినాడ: కాకినాడ దుమ్ములపేట, పర్లోపేట ప్రాంతాల్లో ముగ్గురు అతిసార బారిన పడడంతో నగరపాలక సంస్థ యంత్రాంగం అప్రమత్తమైంది. కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్ శనివారం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. అతిసారం బాధితుల నివాసిత ప్రాంతాల్లో నగర పాలకసంస్థ ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ఆయా ప్రాంతాలను పరిశుభ్రం చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది నీటి నమూనాలను పరిశీలించారు. నీటి లోపం లేదని నిర్ధారణకు వచ్చారు. పరిసరాల పరిశుభ్రత, ఆహార లోపం వంటి కారణాలపై ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అతిసారంపై ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు.



జీజీహెచ్‌లో అతిసార బాధితులతో మాట్లాడుతున్న ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీ చరణ్

కులమతాలకు అతీతంగా ప్రజాసేవ

- విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు



గోకవరంలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

గోకవరం: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ కులమతాలకు అతీతంగా ప్రజాసేవ చేయడమే తన లక్ష్యమని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. ఆయన సహకారంతో సంకురాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడకు చెందిన కిరణ్ కంటి ఆసుపత్రి సిబ్బంది గత నెలలో గోకవరంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గోకవరంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన రోగులు వైద్య శిబిరానికి తరలివచ్చి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 120 మందికి కళ్లజోళ్లు, 20 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. కాగా శనివారం స్థానిక సత్యకృష్ణ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో వారందరికీ కంబాల శ్రీనివాసరావు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద దాసరి తమ్మన్నదొర, రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాథరావుశర్మ, దాసరి ధర్మరాజు, వల్లేపల్లి రమాసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.